ప్రలోభాలపై కేసులు!

- ఆధిక్యత ఉన్నా అధికారపార్టీకి సీట్ల వెలితి
- రెబెల్స్ బెడద.. లీడర్ల మధ్య సమన్వయ లోపం
- తుది దశ పోరు యమ సీరియస్!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండు దఫాల కంటే కూడా తుది విడత ఎన్నికల్లో ప్రలోభాలు భారీగానే సాగాయి. దీనిపై కేసులు కూడా నమోదు అవుతున్నట్టు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో కూసుమంచి మండలంలోని ఓ పంచాయతీలో ప్రధాన ప్రతిపక్షానికి చెందిన అభ్యర్థి రెండో దఫా ఎన్నికల్లో ఓటుకు రూ.10వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ దఫా ఎన్నికల్లోనూ అందుకు ఏమాత్రం తీసిపోని రీతిలో ప్రలోభాలు జరుగుతున్నాయి. సోమ, మంగళవారం రాత్రుల్లో డబ్బులు, బీరులు, ఇంట్లో ఉపయోగించే వివిధ రకాల సామగ్రిని పంచుతున్నారు. మద్యం విషయంలో మాత్రం వెనక్కి తగ్గడం లేదు. దావత్‌లు భారీగా షురూ చేశారు. ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల వల్ల చికెన్, మటన్ ధరలు కూడా పెంచారు. అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా బల్క్ ఆర్డర్లు ఇస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఎంపి విస్కీ, 90 ఎంఎల్ బాటిల్స్‌ను భారీగా కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ జరుగుతున్నట్టు తెలిసింది. పాయింట్ జేబులు, బండి కవర్లు, డిక్కీల్లో పట్టేయడానికి ఇవి అనువుగా ఉంటాయి. పంపిణీ కూడా తేలికవుతుండటం దీనిని ఎంచుకున్నారు. కొన్నిచోట్ల కులసంఘాల పెద్దల వద్ద డబ్బు, మద్యం ఉంచుతున్నారు. వారి ద్వారా పంపిణీలు చేయించి గంపగుత్తగా ఓట్లు వేయించుకునే టెక్నిక్ పాటిస్తున్నారు. మహిళా సంఘాలు, కూలీల గుంపుల విషయంలోనూ ఇదే జరుగుతున్నట్టు తెలుస్తోంది. కొన్నిచోట్ల అభ్యర్థులు పంపిణీల విషయంలో ఓ అవగాహనకు వచ్చినా.. ఆ తర్వాత ఒకరికి తెలియకుండా మరొకరు అదనంగా పంచుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఇలాంటి ప్రలోభాలకు సంబంధించిన చర్యలు ఆధారాలతో నిరూపితమైతే ఎన్నికలను రద్దు చేయొచ్చు. కానీ ఎక్కడా ఎలక్షన్ కమిషన్ అటువంటి చర్యలేవీ తీసుకున్న దాఖలాలు లేవు.

రెబెల్స్ మధ్య సమన్వయ లోపం

ప్రధాన పార్టీల లీడర్ల మధ్య సమన్వయ లోపం ఫలితాలపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా అధికార పార్టీని రెబెల్స్ బెడద ఎక్కువగా వేధిస్తోంది. కొన్నిచోట్ల సస్పెన్షన్ చర్యలు తీసుకున్నా ఏమాత్రం వెరవకుండా తిరుగుబాటుదారులు పోటీకి సై అంటున్నారు. ఖమ్మం జిల్లాలో చివరి విడత ఎన్నికలు జరిగే సత్తుపల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో రెబెల్స్ సమస్య తీవ్రంగా ఉంది. ఇప్పటికే అక్కడి ఎమ్మెల్యే మట్టా రాగమయి హెచ్చరించినా.. కొందరిపై సస్పెన్షన్ వేటువేసినా తిరుగుబాటుదారులు అదే పార్టీకి చెందిన ఓ గ్రూపు మద్దతుతో బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో కొన్నిచోట్ల ప్రధాన ప్రతిపక్షంతో అధికార పక్షం రెబెల్ అభ్యర్థులు అవగాహనకు వచ్చారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లోనూ తిరుగుబాటు అభ్యర్థుల కారణంగా కొన్నిస్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. కొన్నిచోట్ల పార్టీ నిలిపిన అభ్యర్థులు రెబెల్ అభ్యర్థులు విజయం సాధించారు. ఈసారి కూడా ఇలాంటి సీన్ రిపీట్ అవుతుందని భావిస్తున్నారు. రెండు దఫాల ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించింది. ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతం అయినా.. రెబెల్ కారణంగా రావాల్సిన స్థానాల్లో కొన్నింటిని కోల్పోయే ప్రమాదం ఉంది. క్రమశిక్షణా చర్యల విషయంలో అధికార పార్టీ అనుసరించే ఉదాసీన వైఖరి కూడా రెబెల్ అభ్యర్థుల్లో భయాందోళన లేకపోవడానికి కారణమని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. రాష్ట్రంలోనూ ఇదే తరహాలో అధికారపార్టీ పరిస్థితి ఉన్నట్టుగా గత రెండు విడతల ఎన్నికల్లో ప్రస్ఫుటమైంది. మొదటి, రెండో విడత కంటే మలి దశ పోరు యమ సీరియస్‌గా జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే భారీగానే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పని హక్కును హరించే ఉపాధి హామీ బిల్లు

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2005 (ఎంజిఎన్ఆర్ఇజిఎ) ను రద్దు చేసేందుకు ప్రతిపాదించిన వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ ఫర్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025 (విబి-జి రామ్-జి) ను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిబిఎఫ్, నరేగా సంఘర్ష్ మోర్చా డిమాండ్ చేసింది. ఈ మేరకు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికులు, కార్మిక సంఘాలతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా ప్రవేశపెట్టిన ఈ బిల్లు అత్యంత దుర్మార్గమైనది విమర్శించారు.

ఎంవిఎన్ఆర్ ఆస్పత్రిలో ఉచిత కంటి పరీక్షలకు మంచి స్పందన

- వాసన్ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంతంలో ఎంహెచ్ భవన్‌లో ఉన్న మల్లు వెంకట నరసింహారెడ్డి (ఎంవిఎన్ఆర్) స్మారక ఆస్పత్రిలో హిమాయత్‌నగర్ వాసన్ ఐ కేర్ ఆస్పత్రి సహకారంతో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. నవతెలంగాణ సిబ్బంది, కుటుంబ సభ్యులతోపాటు స్థానికంగా ఉండే ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి డాక్టర్లు రమేష్, హాజి పర్యవేక్షణలో ఈ కంటి పరీక్షలను నిర్వహించారు. సుమారు 80 మందికిపైగా ఈ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కె ఆనందాచారి, నవతెలంగాణ జనరల్ మేనేజర్లు భరత్, వెంకటేశ్, శశిధర్, రఘు, నరేందర్‌రెడ్డి, పవన్, బోర్డు సభ్యులు మోహన్‌కృష్ణ, సలీమ, మేనేజర్ వీరయ్య, ఎంవిఎన్ఆర్ ఆస్పత్రి ప్రతినిధి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్ పెంచాలి

- కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలి : వెంకటేష్
- హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆసరా పింఛన్ పెంచాలని, అలాగే కొత్త దరఖాస్తుదారులకు వెంటనే పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 12 రకాల ఆసరా పింఛన్లు అందిస్తోందని తెలిపారు. అయితే అర్హులైన లక్షలాది మంది పేదలు కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారని తెలిపారు. కొత్త దరఖాస్తుదారులకు పెన్షన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చే రూ.2,016 పెన్షన్‌ను రూ.4,000కు, వికలాంగులకు రూ.4,016 పెన్షన్‌ను రూ.6,000కు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చిందని గుర్తుచేశారు. రెండు సంవత్సరాలైనా ఆ హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే పింఛన్ పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వై వరలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్ ప్రసంగించారు.

ధర్నా అనంతరం సిపిఎం ప్రతినిధి బృందం అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్.. వారి విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ ధర్నాలో మహిళా సంఘం నగర అధ్యక్షులు ఏ.పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి ఉద్యమించిన మాడపాటి

ప్రజాశక్తి కల్చరల్

నిజాం పాలనలో తెలుగు భాషా భివృద్ధికి ఉద్యమించిన ప్రముఖులలో మాడపాటి హనుమంతరావు ముఖ్యుడు అని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు ఆంధ్ర మహా సభ ఏర్పాటుకు కృషి చేసి జాతీయ ఉద్యమంలో పాల్గొని తదుపరి హైదరాబాద్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా రాష్ట్ర శాసన మండలి తొలి చైర్మన్‌గా నిరంతరం ప్రజా సంక్షేమం కోసం ఆలోచించిన మహా నాయకులు మాడపాటి హనుమంతరావు అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా మాడ పాటి హనుమంత రావు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోలేటి దామోదర్ మాట్లాడుతూ మాడపాటి సామాజిక కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మ భూషణ్ పురస్కారంతో గౌరవించిందని గుర్తుచేశారు. బాలికల విద్యను ప్రోత్సహించే నిమిత్తం విద్యా సంస్థ ఏర్పాటు చేశారని, అదే నారాయణ గూడలోని మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాలని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్‌బి రామ్ గాన సభ సభ్యులు భమిడిపాటి ఉష శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరు స్వదేశీ యుఎవి రక్షణ ఉత్పత్తుల ఆవిష్కరణ

- రఘువంశీ భారత రక్షణ సామర్థ్యాల విస్తరణ

హైదరాబాద్ : భారతదేశ రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థకు పటిష్ఠ ప్రోత్సాహకంగా కొత్త డీప్‌టెక్ డిజైన్, ఉత్పత్తి, ఇంటిగ్రేషన్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు రఘు వంశీ ఏరోస్పేస్ తెలిపింది. అదే విధంగా పూర్తిగా భారతదేశంలో అభివృద్ధి చేసిన ఆరు స్వదేశీ యుఎవి, అటానమస్ రక్షణ ఉత్పత్తులను సోమవారం ఆవిష్కరించింది. కొత్త తయారీ, సాంకేతిక అభివృద్ధిలో రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి మద్దతుతో, మానవ రహిత, తదుపరి తరం రక్షణ వ్యవస్థలలో భారతదేశ స్వావలంబన కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో ఇవి భాగమని రఘు వంశీ ఏరోస్పేస్ గ్రూప్ వ్యవస్థాపకులు, ఎండి వంశీ వికాస్ తెలిపారు. ప్రస్తుతం తాము మూడు దేశాలలో 10 తయారీ కేంద్రాలు, 1,000 కంటే ఎక్కువ మంది ఉద్యోగులతో గ్లోబల్ ఒఇఎంలు, భారతీయ డిపిఎస్‌యుల కోసం ఏరో ఇంజిన్లు, క్షిపణి ఉపవ్యవస్థలను సరఫరా చేస్తోన్నామన్నారు. తమ సంస్థ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని హార్డ్‌వేర్ పార్క్‌లో కొత్తగా సిటాడెల్ క్యాంపస్‌ను ప్రకటించిందని వెల్లడించారు. డిజైన్, సిస్టమ్ ఇంటిగ్రేషన్, అసెంబ్లీ, టెస్టింగ్ కోసం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. స్వదేశీ ప్రతిభను ఉపయోగించుకుని, తదుపరి యుద్ధ యుగానికి ప్రపంచవ్యాప్తంగా ప్రమాణంగా చేయబడిన, ఇంజనీరింగ్ చేయబడిన వ్యవస్థలను తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు.

జెఎస్‌డబ్ల్యు నుంచి సరికొత్త హెక్టార్ విడుదల

హైదరాబాద్ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా సరికొత్త హెక్టార్‌ను విడుదల చేసింది. దీనిని సోమవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ షోరూంలో ఆవిష్కరించింది. ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.11.99 లక్షలుగా నిర్ణయించింది. హెక్టర్ డిజైన్, సౌకర్యం, సాంకేతికతను మెరుగుపరచడం ద్వారా ఈ లగ్జరీ మొబిలిటీ అనుభవాన్ని ప్రజలందరికీ మరింత చేరువ చేస్తోన్నామని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజి ఐటి హెడ్ సుధీర్ కటరియా ఎంజి సిఇఒ రామ్, ఎఎస్ఎం అభయ్ దుబే, బిగ్‌బాస్2 సెలబ్రిటీ కౌషల్ మంద పాల్గొన్నారు.

నిరుపేద రోగులకు ఉచిత చికిత్సలు

- శ్రావణి హాస్పిటల్స్ సహకారం

హైదరాబాద్ : సామాజిక సేవతో కూడిన ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం "గిఫ్ట్ ఆఫ్ హెల్త్ అండ్ సర్జికల్ మిషన్ 2025"ను విజయవంతంగా ప్రారంభించినట్లు శ్రావణి హాస్పిటల్స్ తెలిపింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స చేయించుకోలేని రోగులకు సైతం నాణ్యమైన శస్త్ర చికిత్స సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే తమ నిబద్ధతకు ఇది నిదర్శమని పేర్కొంది. ఈ సామాజిక ఆరోగ్య కార్యక్రమంలో మొత్తం 150 శస్త్ర చికిత్సలను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తోన్నట్లు శ్రావణి హాస్పిటల్స్ ఫౌండర్ శ్రావణి చెట్టుపల్లి తెలిపారు. అంకితభావం కలిగిన సర్జన్లు (శస్త్ర చికిత్స నిపుణులు), అనస్థీషియన్లు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర ఆరోగ్య సంరక్షణ నిపుణులతో కూడిన బందం ఈ మిషన్ కోసం కలిసి పని చేయనున్నారన్నారు. దీని ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలే కాకుండా, వారికి గౌరవం, సంరక్షణ, తిరిగి కొత్త ఆశను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యూరో, స్పైన్ సర్జన్ అయిన డాక్టర్ బి.ఎస్.వి. రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు

ఆన్‌లైన్‌లో డబ్బులు.. మద్యం 'బారులు'?

- నేటి నుంచి ఇంటింటికీ అభ్యర్థులు
- ప్రయాణ ఖర్చులు.. ఫోన్ పేలో డబ్బుల పంపిణీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత ప్రచారానికి తెరపడింది. మీటింగ్ ద్వారా ఎన్ని విషయాలు చెప్పినా ఇంటింటికీ కలిసి ఒప్పించగలిగితేనే నమ్మకం ఏర్పడుతుంది. దీంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ఓట్ల కోసం శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. గుంపులుగా కాకుండా ఒకరిద్దరు వెళ్లి ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఓటర్లు ఇతర ప్రాంతాల నుంచి రావడానికి రానుపోను ఖర్చులంటూ గూగుల్, ఫోన్ పే ద్వారా వ్యక్తిగత ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నారని సమాచారం. రోజుకు ఒక ఖాతా నుంచి లక్ష రూపాయల వరకు ఆన్‌లైన్‌లో పంపించుకునే అవకాశం ఉంది. దీంతో నాలుగైదు ఖాతాల ద్వారా డబ్బుల పంపిణీ జరుగుతున్నట్టు తెలిసింది. ఇదంతా గుట్టుగానే సాగుతుండటం గమనార్హం.

దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లో 269 గ్రామపంచాయతీలు, 2206 వార్డులు ఉన్నాయి. ఇందులో 42 గ్రామపంచాయతీలు, 596 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 227గ్రామపంచాయతీలకు 721 మంది సర్పంచ్ అభ్యర్థులు, 1603 వార్డులకు 4198 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ సమీపిస్తుండటంతో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నాయకులు చివరి ఏ ప్రయత్నాన్నీ వదలడం లేదు. చివరి దశ ఎన్నికలు జరిగే ప్రాంతంలో రెండు మూడ్రోజుల ముందే మద్యం షాపుల్లో కొరత ఏర్పడింది. దీంతో ఎన్నికలు జరగని షాపుల నుంచి మద్యం తెప్పించి పంపకాలు చేస్తున్నారు. అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి మద్యం తెప్పించి పంచుతున్నారు. కొందరికి చీప్ లిక్కర్, మధ్యతరగతి, పైస్థాయి వారికి క్వాలిటీ మందు పంపిణీ చేస్తున్నారు.

తటస్థ ఓటర్లపై దృష్టి

గ్రామాల్లో ఏ పార్టీ వైపు మొగ్గు చూపని వారిని ఎంపిక చేసుకొని అభ్యర్థులు వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. తటస్థ ఓటర్లు ఎటువైపు మళ్లితే అటువైపు విజయం సాధించే అవకాశాలున్నాయి. ఇతర ప్రాంతాలకు వలసపోయిన వారు గ్రామాలలో రాజకీయాలకతీతంగా ఉన్న వారిపై దృష్టి పెట్టి పావులు కదుపుతున్నారు. యువ ఓటర్లపైనే ఎక్కువ దృష్టి పెట్టారు.

హామీలు తీసుకుంటున్న ఓటర్లు

ఈ ఎన్నికల సందర్భంగా నాయకులు తమ ఇంటి దగ్గరకు వస్తే ఓటర్లు సమస్యలను ఏకరువు పెడుతున్నారు. మా పంట పొలాలకు బాటలు లేవని కొందరు, మురికి కాలువలు లేవని, నల్లాలు సక్రమంగా రావడం లేదని, వీధిలైట్లు వేయాలని, దేవాలయాలు కట్టించాలని.. ఈ సమస్యను పరిష్కారం చేయాలని కోరుతున్నారు. అప్పులు తీసుకున్న వారు ఎగ్గొట్టారని, భూమి పట్టా చేయడం లేదని, ప్రభుత్వ భూమికి అడ్డుపడుతున్నారని అనేక సమస్యలను నాయకుల దృష్టికి తెస్తున్నారు. సర్పంచ్‌గా గెలిచిన తర్వాత గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం చేయాలని హామీ తీసుకుంటున్నారు.

దక్షిణ మధ్య రైల్వేలో పెన్షన్ అదాలత్

- హాజరైన సీనియర్ అధికారులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వేలో సోమవారం రిటైరైన ఉద్యోగుల కోసం పెన్షన్ అదాలత్‌ను నిర్వహించారు. దీనికి జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ హేమ సునీత, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాకటర్ నిర్మలా రాజారాం, చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జిఆర్ఎస్ రావు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. 2025లో పదవీ విరమణ చేసిన వారికోసం ఈ కార్యక్రమన్ని చేపట్టారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ ప్రాంతాల్లోనూ పెన్షన్ అదాలత్‌లు నిర్వహించినట్టు అధికారులు చెప్పారు. ఈ ఏడాదిలో మొత్తం 371 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. ఇందులో 361 కేసులను పరిష్కరించినట్టు తెలియజేశారు. అలాగే 70884 ఉమీద్ కార్డులను అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీవాస్తవ మాట్లాడుతూ అయా అంశాల్లో ధక్షిణమధ్య రైల్వే శరవేగంగా అభివృద్ధిచెందుతున్నదని వివరించారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

IN THE COURT OF MS. NEELAM SINGH
District Judge (Comm. Court-05)
Room No.22, Block-I, South-East District
Saket Courts, New Delhi.
NOTICE FOR PUBLICATION
(Order 5, Rule 20 of the CPC.)
CS (COMM) NO. 39/2024
M/S GRAFIX SOLUTIONS .....Plaintiff
VS.
M/S VAJRA TRADERS AND ORS. ...Defendants
To,
D-1, M/s Vajra Trade
Plot No. 106, Mallikarjuna Nagar, North Manoorabad, Hyderabad-50068, Telangana.
D-2, Mr. Vinod Kumar (Proprietor)
Plot No. 106, Mallikarjuna Nagar, North Manoorabad, Hyderabad-50068, Telangana,
MOB: 9533110316.
Whereas Plaintiff has instituted that above Suit FOR RECOVERY against the defendants. You are hereby summoned to appear in this Court in person or by a pleader on the 17th day of DECEMBER 2025, at 10:00 O' clock, to answer the same, failing which the Suit will be disposed of ex-parte.
Given under my hand and the seal of the court, this 15TH DECEMBER, 2025 to be published in Regional Daily Newspaper 'PRAJASAKTI'.
NOTE: Defendant is informed to file WS within a period of 30 days from the date of receipt of summons with advance copy to the plaintiff and filling of WS in commercial suit in 120 days period is mandatory and no extension can be granted.
Sd/-
District Judge (Comm. Court-05)
South East, Saket New Delhi

IN THE COURT OF THE II ADDL. CHIEF JUEDGE, CITY CIVIL COURTS COMPLEX, AT HYDERABAD.
I.A. NO. 1525 OF 2025.
IN
O.S. NO. 123 OF 2012.
Between:
M/s. Padmapriya Constructions
Hyderabad. ....Petitioner/Plaintiff
And
Mr. Mahesh Kumar Agarwal And two others. ...Respondent/Defendants.
To:
1. Mr. Mahesh Kumar Agarwal, S/o Sedhmal Agarwal, Aged 52, years,, Occ: Business, R/o 69/3RT, S.R.Nagar Colony, Hyderabad
2. Mrs. K.Vidhyulatha, S/oK.S.D.Satyaraj, Aged 61 years, Occ: Lecturer R/o 14/367-D, New, Back side of Swagath Hotel, Kamalanagar, Anathapur District.
3. Mr. G.Ravindra Babu Donald, S/o Late G.Rajarathnam, R/o 76/3 RT S.R.Nagar Colony, ...Respondent/ Defendants
Whereas the above I.A.No.1525 of 2025 in O.S. No. 123 of 2012 and the I.A. is posted to *29th December 2025 (Monday)* for your appearance and reply if any.
You are hereby advised to appear on the said date i.e *29th December 2025 (Monday)* at 10.30 AM before the said Hon'ble Court, and in the event of failure of your appearance on the said day, the matter will be dealt with and decided in your absence.
(BY ORDER OF THE HON'BLE COURT)
K. SRILATHA, Advocate,
H.No.12-13-528/52, Flat No. 204,
Sri Sai Nivasam, Street No.14,
Nagarjuna Nagar, Colony, Tarnaka,
HYDERABAD - 500 040. Cell - 9849733396
Place: Hyderabad:
Date : 15th December 2025.

సీడ్‌బిల్లు తీసుకొచ్చేందుకు కసరత్తు

- విత్తన రైతులకు నష్టాలు..కంపెనీలకు లాభాలు
- రైతుకు ఇబ్బంది కాకుండా విత్తనంపై హక్కుండాలి : కోదండరెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో సీడ్‌బిల్లు తీసుకొచ్చేందుకు కసరత్తు పూర్తిచేశామని, ఆ ఫైల్ మంత్రి వద్ద పెండింగ్‌లో ఉందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. విత్తనమనేది చాలా ముఖ్యమైన అంశమనీ, దానిపై రాష్ట్రాలకు కొన్ని హక్కులు కల్పించేలా ముసాయిదా చట్టంలో మార్పులు చేయాలని కేంద్రానికి సూచించారు. విత్తన రైతులకు నష్టాలు వస్తున్నాయనీ, కంపెనీలు మాత్రం లాభాలు పొందుతున్నాయని చెప్పారు. సోమవారం రైతు కమిషన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర విత్తన చట్టం-2025 ముసాయిదాలో అనేక లోపాలున్నాయని ఎత్తిచూపారు. 1994 నుంచి విదేశీ కంపెనీలు రాష్ట్రంలోకి ప్రవేశించాయనీ, కల్తీ, నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని 2004లో అప్పటి ప్రభుత్వం తేల్చిచెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. కల్తీ విత్తనాలను కొన్ని కంపెనీలు బ్రాండ్ వేసుకొని అమ్మటాన్ని తప్పుబట్టారు. 40 శాతం విత్తనాలు తెలంగాణలోనే సాగవుతున్నాయని చెప్పారు. ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తనాలు సాగు చేసిన రైతులు కొందరు చనిపోయారనీ, చాలామంది మంచాన పడ్డారని తెలిపారు. పశువులు కూడా మృత్యువాతపడ్డాయన్నారు. రైతులకు కమిషన్ ఆధ్వర్యంలో ములుగు విత్తన రైతులకు మల్టీనేషనల్ కంపెనీల నుంచి రూ.నాలుగు కోట్ల పరిహారం ఇప్పించామని తెలిపారు. దేశ చరిత్రలో రైతులకు నష్టపరిహారం ఇప్పించడం ఇదే తొలిసారని చెప్పారు. నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు విత్తన ముసాయిదా చట్టంలో మార్పులు చేయాలని కేంద్రానికి సూచించారు. వ్యవసాయరంగం రాష్ట్ర పరిధిలో ఉన్న నేపథ్యంలో కొత్త చట్టంలో రాష్ట్రాలకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

పల్లెల్లో యాసంగి వరినాట్లు మొదలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరినాట్లును మొదలుపెట్టిన రైతులు

నిన్న, మొన్నటి వరకు ధాన్యం అమ్మకాల్లో బిజీగా ఉన్న రైతులు మళ్లీ యాసంగి సాగుపై దృష్టిసారించారు. కరీంనగర్ జిల్లాలో ఎల్లంపల్లి, కాళేశ్వరం జలాలతో జీవనదిగా మారిన వరద కాలువ నీటి ప్రవాహం ఓ వైపు ఉండగా, ఎల్లంపల్లి ఎత్తిపోతలతో నారాయణపూర్ ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. నీటి కరువు లేదన్నభరోసాతో గంగాధర మండలంలోని మెట్ట ప్రాంత రైతాంగం వరి నాట్లను మొదలుపెట్టారు. లక్ష్మీపూర్ పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోసే కాళేశ్వరం, ఎల్లంపల్లి జలాలతో గంగాధర మండలంలో సాగు విస్తీర్ణం పెరిగింది. మండలంలోని అనేక గ్రామాలను ఆనుకుని వెళు న్న వరద కాలువ వల్ల తాగు, సాగునీటి బావుల్లో భూగర్భ జలాలు పెరగడంతోపాటు తూముల వల్ల చెరువుల్లోకి నీరు చేరుతోంది.మండలంలో 39 వేల 269 ఎకరాల భూములు సాగుకు యోగ్యమైనవిగా ఉండగా, సుమారు 23 వేల ఎకరాల్లో వరితోపాటు పలు రకాల పంటలు సాగు అవుతున్నాయి. వర్షాకాల సీజన్‌లో కేవలం 550 ఎకరాల్లోనే వరి సాగు చేసినట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ ప్రస్తుత యాసంగిలో సుమారు 21 వేల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మెట్ట ప్రాంతంలో నూటికి 98 శాతం మంది రైతులు వరి సాగుపైనే దృష్టి పెట్టి నాట్లు వేసే పనిలో పడ్డారు.

సాగునీటి వనరులు పెరిగాయి

పానుగంటి శ్రీనివాస్, రైతు, కొండాయపల్లి

సాగునీటి వనరులు పెరగడం వల్లే వరి పంట వేయాలని నిర్ణయించుకున్నాం.. వరద కాలువ నీటి ప్రవాహంతో వ్యవసాయ బావుల్లో పుష్కలంగా నీరుంది. ప్రతి సీజన్‌లో ఆశించిన పంటల దిగుబడి వస్తుంది. పెట్టుబడి, శ్రమ పెద్దగా ఉండదన్న దృష్టితోనే వరి సాగును చేస్తున్నం. నీరు పుష్కలంగా మారడంతో నేనే కాదు, ప్రతి రైతు వరి సాగునే ఎంచుకున్నరు.

ముగిసిన తుది విడత ప్రచారం

- గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న అభ్యర్థులు
- ఓటుకు రూ.500 నుంచి 5 వేల వరకు పంపిణీ, మందు, విందూ
- పట్టించుకోని ఎన్నికల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పంచాయతీ ఎన్నికల మూడో దశ ప్రచారం సోమవారంతో ముగిసింది. మరో 24 గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. చివరి దశ సమరం తుది అంకానికి చేరుకున్న వేళ పోటీలో ఉన్న వారు అంది వచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం లేదా ప్రలోభ పెట్టేందుకు సర్వ శక్తులూ ఒడ్డుతున్నారు. ఓటుకు రూ.500 నుంచి రూ.5వేల వరకు పంచేందుకు సిద్ధమవుతున్నారు. డబ్బులతో పాటు రాత్రయితే విందు, మందుతో చాలా చోట్ల పచ్చని పల్లెలు నైట్ క్లబ్‌లను తలపిస్తున్నాయి. వీటికి తోడు అభ్యర్థులు అలవిగాని హామీలు ఇస్తున్నారు. తనను గెలిపిస్తే జీవితాంతం కేబుల్ కనెక్షన్ ఫ్రీగా ఇస్తానని ఒకరంటే, పెళ్లిళ్లకు బ్యాండ్ ఫ్రీగా కొడతానని ఇంకొకరు ఇలా విలువలకు పాతరేసి సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన ఈ కొత్త పోకడ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది.కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి ఓటర్లకు ఇత్తడి బిందెలు పంచుతుండగా ప్రత్యర్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. రంగారెడ్డి జిల్లా ఎక్లాస్‌ఖాన్ పేటలో సర్పంచ్ అభ్యర్థి అర్ధరాత్రి ఓటర్లకు డబ్బులు పంచుతుంటే అడ్డుకున్న గ్రామస్తులపై దాడికి పాల్పడ్డారు. దాంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అరెస్ట్ చేశారు. ఇక ఖమ్మం జిల్లాలో అయితే ఓ సర్పంచ్ అభ్యర్థి ఏకంగా ప్రత్యర్థి గుర్తు ఉన్న బ్యాలెట్ పేపర్‌కు క్షుద్ర పూజలు చేయడం సంచలనంగా మారింది. మొదటి, రెండో దశ సర్పంచ్ ఎన్నికల్లో మచ్చుకు కొన్ని మాత్రమే. ఇక చివరి దశ పంచాయతీ ప్రచారం ముగిసిన వేళ ఎన్నికలు జరగనున్న పల్లెల్లో అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుంటా ఇంటింటి ప్రచారం చేస్తూ మద్యం, చికెన్, మటన్, నగదు పంపిణీకి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఓట్ల కోసం వాయిస్ మెసేజ్‌లు, ఫోన్‌పే ద్వారా నగదు పంపిణీ జరుగుతోంది. కుల సంఘాలు, మహిళా సంఘాల వారీగా తాయిలాలు, హామీలు ఇస్తూ మద్దతు కూడగడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు తమకే పడాలనే లక్ష్యంతో అభ్యర్థులు రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారు. హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ధన ప్రవాహం జోరుగా సాగుతోందని తెలుస్తోంది. పలు మేజర్ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసిన అభ్యర్థులు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. డబ్బు మాత్రమే కాకుండా వెండి, బంగారం ఆభరణాలు, గృహోపకరణాలు కూడా పంపిణీ చేస్తున్నట్టు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో మహిళా ఓటర్లకు వెండి గ్లాసులు, చిన్న చిన్న బంగారు నగలను కూడా పంపిణీ చేస్తున్నట్టు సమాచారం. ఒక్క ఓటు కూడా పక్కదారి పట్టకుండా డబ్బులు, ఇతర తాయిలాలు అందిస్తూ దేవుళ్లు, కుటుంబ సభ్యులపై ఒట్టేయించుకుంటున్నారు. ఇదంతా నోటి మాటతో కాదు... వాల్ పోస్టర్లు, వీడియో, ఆడియో సందేశాలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థులు విచ్చలవిడిగా ఖర్చు చేయడంతో పాటు హామీలను గుప్పిస్తున్నారు.

నోటీసులతోనే సరి పెడుతున్న ఎన్నికల సంఘం

సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల్లో డబ్బు, మద్యం, బలవంతపు ఏకగ్రీవాలు, వేలం పాటలు, ఇతర తాయిలాలపై వస్తున్న ఫిర్యాదులు, సోషల్ మీడియా పోస్టులపై రాష్ట్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు నుంచి ఓటర్లను ప్రలోభ పెట్టేవరకు టీయాప్, టోల్‌ఫ్రీ నెంబర్‌కు ప్రతి రోజు వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. వాటన్నింటిపై ఎన్నికల సంఘం నామ మాత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2023 శాసన సభ ఎన్నికల సమయంలో రూ.724 కోట్ల విలువ చేసే డబ్బు, మద్యం, మత్తు పదార్థాలు పట్టుబడ్డాయి. అయితే ఈ పంచాయతీ ఎన్నికల్లో అంతకంటే ఎక్కువగా మద్యం, డబ్బు ఏరులై పారుతున్నా పట్టించుకోవడం లేదని ఆపవాదును ఎన్నికల సంఘం మూటగట్టుకుంటోంది.

దావా సమను
మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS No : 154/2024
Between:-
కొత్త సుబ్బారావు ....వాది
మరియు
పెద్దిపాగ బేబి వగైరాలు ....ప్రతివాదులు
To,
D3) శ్రీమతి దేవరకొండ హేమలత
W/o వెంకయ్య, డోర్ నెం. 3-13-1/5, సూర్యనగర్, మాదాపూర్ ఉప్పల్- నాచారం, K.V రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పై నంబరు గల దావాను మీ పై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ చేరనందున ఈప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగాది.23-12-2025న ఉదయం 10-30ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల మీపరోక్షము నందు దావాను విచారించి తీర్మానించబడును.
// శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది :- 23-12-2025
ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీ రమణి
న్యాయవాదులు, పర్చూరు.

ఈ ఫలితాలు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

- అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు : కెటిఆర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రెండోదశ పంచాయతీ ఎన్నికల్లోనూ గులాబీ శ్రేణులు అద్వితీయ ఫలితాలను సాధించాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కెటిఆర్) తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎక్స్ (ట్విట్టర్)లో స్పందించారు. రెండో దశలో గెలిచిన గులాబీ శ్రేణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సత్తాచాటారని పేర్కొన్నారు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో కాలం చెల్లిందని పల్లె ప్రజలు ఓటు ద్వారా మరోసారి నిరూపించారని తెలిపారు.

ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖ చిత్రానికి నిదర్శనమని వివరించారు. రేవంత్‌రెడ్డి రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకుతోడు గ్యారెంటీల అమల్లో చేసిన ఘోరమైన మోసాలే కాంగ్రెస్‌కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని పేర్కొన్నారు. పార్టీ గుర్తులేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న ఫలితాలు చెంపపెట్టులాంటివని తెలిపారు. నాడు బిఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే నేడు కాంగ్రెస్ సగం స్థానాలు కూడా గెలవకపోవడం అధికార పార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదనీ, రిక్తహస్తమని, అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని తెలిపారు. కష్టకాలంలో బిఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతి ఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుందని పేర్కొన్నారు.

హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- లీజు భూమి, షాపుల రెగ్యులరైజేషన్‌కు అవకాశం
- ఇండ్ల పక్కన ఉన్న వంద గజాల్లోపు స్థలాల విక్రయాలకు పచ్చజెండా
- మంత్రి పొంగులేటి వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హౌసింగ్ బోర్డు భూముల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కావడానికి వీల్లేదని కోరారు. హౌసింగ్ బోర్డు భూములపై సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. హౌసింగ్ బోర్డు భూముల లీజు, ఒప్పందాలు, కోర్టు కేసులు, అద్దెలు తదితర అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే మరోవైపు లీజు, కమర్షియల్, అద్దెలు, రెగ్యులరైజేషన్ తదితర అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిజాం కాలం నుంచి 115 సంస్థలకు హౌసింగ్ బోర్డు భూములను లీజుకు ఇవ్వడం జరిగిందనీ, ఇందులో ప్రధానంగా విద్యాసంస్థలు, గృహ వినియోగం, వాణిజ్యం, దేవాలయాలు తదితరాలున్నాయని వివరించారు. ఏడు స్థలాలకు సంబంధించి కోర్టు కేసులు, అలాగే అద్దెబకాయిలున్నాయంటూ అధికారులు మంత్రికి వివరించారు. లీజు ఒప్పందాల పునరుద్ధరణ చేసుకుని సంస్థలకు హౌసింగ్ బోర్డు తరపున లేఖలు రాసి వాటి రెగ్యులరైజేషన్‌కు అవకాశమివ్వాలని అధికారులకు మంత్రి సూచించారు. రాష్ట్రంలో హౌసింగ్ బోర్డుకు వివిధ ప్రాంతాల్లో 301 వాణిజ్య దుకాణాలు ఉండగా 2007లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకు 14 మంది షాపులు కొనుగోలు చేశారని వివరించారు. మిగిలిన 287 దుకాణాలకుగాను 62 దుకాణాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయనీ, హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం ప్రతి దుకాణం యజమాని ఏటా పది శాతం అద్దెను పెంచుతూ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అయితే ఈ నిబంధన అమలు కాకపోవడంతో దుకాణ యజమానుల నుంచి హౌసింగ్ బోర్డుకు రూ.కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్నవారు వాటిని కొనుగోలు చేయడానికి ముందుకొస్తే మార్కెట్ ధర ప్రకారం విక్రయించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. దుకాణం నిర్వహణకు అనువుగా లేకుంటే ఆ స్థలాన్ని వేలంలో విక్రయించాలని కోరారు.

కోర్టు కేసులపై ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించాలి

కోర్టు కేసుల్లో ఉన్న భూములు హౌసింగ్ బోర్డుకు చెందేలా పటిష్టమైన వాదన వినిపించేలా ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించుకోవాలని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హౌసింగ్ బోర్డు గతంలో కేటాయించిన ఇండ్లకు పక్కనే ఉన్న వంద గజాల్లోపు స్థలాలను ఆ ఇంటి యజమానికి ఆసక్తి ఉంటే విక్రయించాలని సూచించారు. గతంలో ఇంటి కోసం హౌసింగ్ బోర్డు కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి ఇప్పుడు ఆ అవకాశం కల్పించాలని కోరారు. పక్కనే ఉన్న వంద గజాల్లోపు స్థలాన్నీ కొనుగోలు చేసుకుంటే మొత్తం స్థలానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశమివ్వాలని సూచించారు. మార్కెట్ ధర, సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ కార్డు విలువ వంద గజాల్లోపు స్థలాల వివరాలు, రిజిస్ట్రేషన్ కాని ప్లాట్ల వివరాలు, రిజిస్ట్రేషన్ చేసుకుని పక్కనే ఉన్న వంద గజాల్లోపు స్థలాన్ని అడుగుతున్నవారి వివరాలు తదితర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక తయారుచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వీటిపై మంత్రివర్గంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండి విపి గౌతమ్, సిఇ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డప్పులు కొట్టలేదని దళితుల గ్రామ బహిష్కరణ

- భిక్కనూర్ మండలం ఈసన్నపల్లిలో ఘటన
- జిల్లా ఎస్‌పికి, కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆందోళన చేస్తున్న దళితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డప్పులు కొట్టనందుకు దళితులను గ్రామ బహిష్కరణ చేశారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని ఈసన్నపల్లి గ్రామంలో జరిగింది. ఈ విషయమై దళితులు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఎస్‌పి రాజేష్‌చంద్ర, జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామానికి ఎస్‌సి రిజర్వేషన్ వచ్చింది. అయితే గ్రామంలో మాల సామాజిక తరగతికి చెందిన ముగ్గురు, మాదిగ సామాజిక తరగతికి చెందిన ఇద్దరు సర్పంచ్ పదవికి పోటీ చేశారు. మాల సామాజిక తరగతికి చెందిన వ్యక్తి సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట గ్రామంలో ఓ వ్యక్తి మృతిచెందితే మాదిగలు డప్పు కొట్టలేదు. దీంతో గ్రామస్తులంతా ఏకమై 'మాదిగ కులస్తులకు ఎటువంటి సహాయం చేసినా వారికి రూ.50 వేలు జరిమానా విధిస్తాం' అని తీర్మానించారు. తీర్మానాలను పేపర్‌పై రాసి గ్రామ వాట్సప్ గ్రూపులో పోస్టు చేశారు. "మాకు తాగడానికి నీరు ఇవ్వడం లేదు.. కాలనీకి వచ్చే నీటి మోటర్లను తీసుకెళ్లారు.. పిల్లలను స్కూలుకు రానివ్వడం లేదు.. బీడీలు కూడా తీసుకోవద్దని మునీమ్‌కు చెప్పారు.. మహిళా సంఘాల డబ్బులు తీసుకోవద్దని గ్రామ సిఎలకు చెప్పారు" అని గ్రామ బహిష్కరణకు గురైన మాదిగలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆందోళన చేయడం లేదని, లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు సత్తిగారి లక్ష్మి, ఎమ్మార్పీఎస్ నాయకులు, దళితులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

బిఆర్ఎస్ భ్రష్టుపడుతోంది

- రాజయ్య ఇప్పటికైనా కళ్లు తెరవాలి
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొన్ని కొరివి దయ్యాల వల్ల బిఆర్ఎస్ భ్రష్టుపడుతోందని, అందులో పెద్ద కొరివి దయ్యం పల్లా రాజేశ్వర్ రెడ్డి అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో రాజయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చాలా దిగజారి మాట్లాడారని విమర్శించారు. అయినా బిఆర్ఎస్ చాలా గ్రామాలలో ఉనికే లేదని, కనీసం ఆ పార్టీ బలపర్చిన వాళ్లు పోటీలలోనూ లేరని అన్నారు. రాజకీయ పరిపక్వత కలిగిన నియోజకవర్గ ప్రజలు వారిని పట్టించుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల నమ్మకంతో ఓటేసి మెజార్టీ సర్పంచులను గెలిపించారని చెప్పారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు.

కల్వకుంట్ల కుటుంబంలో పల్లా చేరి ఆ కుటుంబాన్ని అంతా చిన్నాభిన్నం చేశారని అందుకే కవిత దూరమైపోయారని అన్నారు. కెటిఆర్, హరీశ్‌రావు మధ్య కూడా కొంత గ్యాప్ వచ్చిందని, వీటన్నిటికీ కారణం పల్లా రాజేశ్వర్‌రెడ్డి అని ఆరోపించారు. అలాంటి వ్యక్తి ఇక్కడికి వచ్చి సుద్ద పూసలాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్టీలో రాజయ్యను జీరో చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. రాజయ్య ఇప్పటికైనా కండ్లు తెరిచి తనను తిట్టడం కాకుండా బిఆర్ఎస్‌లో, నీపై ఎం జరుగుతుందో తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మెన్ లావణ్య శిరీష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు బెలిదే వెంకన్న, లింగాల జగదీష్ రెడ్డి, బూర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

17న తెలంగాణ భవన్‌లో మహాపడిపూజ

- తలసాని సాయికిరణ్ యాదవ్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఈ నెల 17న సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహా పడిపూజ కార్యక్రమం జరుగుతుందని బిఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జీ తలసాని సాయికిరణ్ యాదవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పూజకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హాజరవుతారని వివరించారు. పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలం నిరూపితమైందని చెప్పారు. 50 శాతం పంచాయతీలను కూడా అధికార కాంగ్రెస్ పార్టీ గెలుచుకోలేకపోయిందని అన్నారు. పాలన గాలికొదిలి ఫుట్‌బాల్ ఆటపై దృష్టిపెడితే ప్రజలు ఇలాంటి తీర్పే ఇస్తారని వివరించారు. బిఆర్ఎస్ నేత చిరుమళ్ల రాకేశ్‌కుమార్ మాట్లాడుతూ రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అద్భుతమైన విజయాలు వచ్చాయని చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని అన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేల సొంత గ్రామాల్లోనూ ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. మూడో విడత ఎన్నికల్లోనూ బిఆర్ఎస్‌కు మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బాలకృష్ణ, సాయితేజ రావు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల తెలంగాణ రైజింగ్

- సామాజిక, ఆర్థిక పురోగతికలో పరుగులు
- దేశంలోనే ఆదర్శవంతమైన కార్యక్రమాలు అమలు
- దేశవిదేశాలను ఆకర్షించిన ఫ్యూచర్ సిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండేళ్ల కాంగ్రెస్ పాలన తెలంగాణ రైజింగ్ అని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. 24 నెలల ప్రజా పాలనలో తెలంగాణ సామాజికంగా, ఆర్థికంగా కొత్త అడుగులు వేసిందని తెలిపింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచే ప్రజాస్వామిక మార్పు మొదలైందని పేర్కొంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సుస్థిర పాలనతో దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలబెట్టిందని తెలిపింది. రోజుకో వినూత్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన విధానాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొంది. ఆరు గ్యారంటీల హామీల అమలుతో మొదలైన ప్రయాణం నాలుగు కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను ఆవిష్కరించే దిశగా పరుగులు తీసిందని ప్రకటించింది. తెలంగాణను ది ఫ్యూచర్ స్టేట్‌గా.. హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ప్రపంచానికి పరిచయం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన బృహత్తర ప్రయత్నం దేశవిదేశాలను ఆకర్షించిందని తెలిపింది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు తరలిరావటం శుభ పరిణామమని పేర్కొంది.

61,379 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ

దేశంలోనే వినూత్నంగా రాష్ట్రంలో విజయవంతంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన, బీసీలకు రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, రేషన్ కార్డుదారులపై సన్న బియ్యం పంపిణీ వంటి చర్యలు మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు పదేండ్లుగా జరిగిన అన్యాయాన్ని సరిదిద్దిందని పేర్కొంది. న్యాయమైన నీటి వాటాల సాధనకు ప్రజా ప్రభుత్వం చేసిన పోరాటం అందరినీ ఆకర్షించిందని తెలిపింది. రికార్డు వేగంతో 61,379 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చిందని ప్రకటించింది. అప్పుల్లో చిక్కిన రాష్ట్ర ఖజానాను వడ్డీల భారం నుంచి ఉపశమనం కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుసరించిన లోన్ రీస్ట్రక్చరింగ్ ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పట్టిందని తెలిపింది. వాటితోపాటు ప్రభుత్వం ఈ రెండేండ్లలో అన్ని వర్గాలనూ ఆకట్టుకునేందుకు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను చేపట్టిందని పేర్కొంది.

కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు

- న్యాయపరంగా అండగా ఉంటాం
- సర్పంచులను వేధిస్తే ఊరుకోం..
- ప్రతి జిల్లాలో 'లీగల్ సెల్' ఏర్పాటు
- సిరిసిల్లలో బిఆర్ఎస్ సర్పంచులకు దిశానిర్దేశం చేసిన కెటిఆర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదు.. వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బిఆర్ఎస్ తరపున ప్రత్యేక న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం.. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు.." అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ సర్పంచులకు సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గెలుపొందిన బిఆర్ఎస్ సర్పంచులకు సోమవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడొద్దని చెప్పారు. 'మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులుగాని, పాలకపక్ష నేతలుగానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అర్థ గంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది. కోర్టు ద్వారా మన హక్కుల కోసం కొట్లాడుదాం' అని కెటిఆర్ అన్నారు. రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు రావాల్సిన ఫైనాన్స్ కమిషన్ నిధులను ఎవరూ ఆపలేరని, ఆ నిధులు సాధించుకునే బాధ్యత తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెండేండ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత వచ్చిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు సర్పంచ్ ఎన్నికల్లో 40 నుంచి 70 శాతం స్థానాల్లో బిఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తిలో కిడ్నాప్ వంటి ఘటనలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సర్పంచులు కేవలం పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని కెటిఆర్ వెల్లడించారు. చివరి విడత ఎన్నికల్లోనూ పార్టీ శ్రేణులు కష్టపడి గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ నాలకొండ అరుణ, తుల ఉమా, ఏనుగు మనోహర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంబిబిఎస్ విద్యార్థిని మృతి

- తండ్రికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ఇంటి నుంచి కాలేజీకి వెళ్లేందుకు తండ్రితో కలిసి రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఎంబిబిఎస్ విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. తండ్రి తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటనహైదరాబాద్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం చిట్కూల గ్రామానికి చెందిన యంసాని పాండు 30 ఏళ్ల కిందట హైదరాబాద్‌కు వచ్చారు. ప్రస్తుతం హయత్‌నగర్‌లోని వినాయక నగర్ కాలనీలో భార్య, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. అతను ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. కుమారుడు విదేశాల్లో చదువుతుండగా, కుమార్తె ఐశ్వర్య (19) మహబూబ్‌నగర్‌లో ఎంబిబిఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఇంటికి వచ్చిన ఐశ్వర్య సోమవారం కాలేజీకి వెళ్లేందుకు తండ్రితో కలిసి ఆర్‌టిసి కాలనీ నుంచి నడుచుకుంటూ వచ్చింది. రోడ్డు దాటుతుండగా ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చిన వారిద్దరిని ఢీకొట్టింది. దాంతో ఐశ్వర్య తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించింది. పాండు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

- నిందితుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలికకు మాయమాటలు చెప్పి ఓ దుండగుడు లైంగికదాడి చేశాడు. బాలిక గర్భం దాల్చడంతో విషయం ఆలస్యంగా వెలుగుజూసింది. నిందితునిపై పోక్సో కేసు నమోదైంది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆల్విన్ కాలనీలో నివాసముండే 16 ఏళ్ల బాలికకు తల్లిదండ్రులు లేరు. నానమ్మ సంరక్షణలో ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటోంది.

ఈ నేపథ్యంలో ఆరు నెలల కిందట రైలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పల్నాడుకు చెందిన 25 ఏళ్ల యువకుడు పరిచయమయ్యాడు. సోషల్ మీడియాలో బాలికతో పరిచయం కొనసాగించిన యువకుడు తరచూ హైదరాబాద్ వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో మాయమాటలు చెప్పి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్‌లోని ఒక లాడ్జికి తీసుకెళ్లి పలుమార్లు లైంగికంగా లోబరుచుకున్నాడు. దాంతో బాలిక గర్భం దాల్చగా తొలగించుకోవాలని సూచించాడు. అనంతరం అతను ఫోన్‌లో కూడా స్పందించలేదు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురికావడంతో నానమ్మ వైద్యుల వద్దకు తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్ బాలిక గర్భం దాల్చినట్టు చెప్పారు. దాంతో బాలిక నగరంలోని మధుర నగర్ పోలీస్ స్టేషన్‌లో ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసింది. జగద్గిరిగుట్ట పోలీసులు సోమవారం సమాచారం సేకరించి సదరు బాలికను ఆస్పత్రికి తరలించారు. వివరాలు బదిలీ చేయగా కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

క్రైస్తవ సమాజం సమస్యలు పరిష్కరిస్తా

- మంత్రి మొహ్మద్ అజారుద్దీన్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

క్రిస్మస్ అనేది ఆనందం, సంతోషం, ఐక్యతతో పాటు ప్రేమ, శాంతి, కరుణ సందేశాలను సమాజానికి చాటి చెప్పే పవిత్ర పండుగ అని మైనారిటీ సంక్షేమం శాఖ మంత్రి మొహ్మద్ అజారుద్దీన్ అన్నారు. డా. బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో సోమవారం సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తాను క్రైస్తవ విద్యాసంస్థలో చదువుకున్నానని, అక్కడ ప్రతి సంవత్సరం క్రిస్మస్‌ను ఎంతో ఆత్మీయంగా, ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకునే అవకాశం లభించిందని గుర్తు చేశారు. స్నేహితులు, ఉపాధ్యాయులతో కలిసి ఐక్యత, స్నేహభావం నిండిన వాతావరణంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్న రోజులను ఆయన స్మరించుకున్నారు. బాక్సింగ్‌డే సందర్భంగా క్రికెట్ మ్యాచ్‌లు ఆడడం తమ విద్యార్థి దశలో ఒక మధురమైన సంప్రదాయమని పేర్కొంటూ, అవి క్రమశిక్షణ, జట్టు సమన్వయం, క్రీడాస్ఫూర్తి, పరస్పర గౌరవం వంటి విలువలను నేర్పాయని తెలిపారు. క్రిస్మస్ పండుగ పేదల పట్ల సహానుభూతి, పంచుకునే స్వభావం, సమాజంలో పరస్పర సంబంధాలను బలపరచుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుందని మంత్రి అజారుద్దీన్ అన్నారు. ఇటువంటి పండుగలు సామాజిక సామరస్యతను పెంపొందిస్తూ, భారతదేశపు "వైవిధ్యంలో ఏకత్వం" అనే మహత్తర సంప్రదాయాన్ని మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ, శాంతియుతంగా, సమగ్రంగా, ఆనందోత్సాహాలతో జరుపుకునేలా కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. క్రైస్తవ సోదరసమాజానికి హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ పండుగ ప్రతి ఇంటికి శాంతి, సమృద్ధి, ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రైస్తవ సమాజానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా రేవ్. డా. జాన్ వెస్లీ ప్రేరణాత్మక క్రైస్తవ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమం సెక్రటరీ బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ సబిత, సచివాలయ క్రైస్తవ ఉద్యోగుల సంఘ సభ్యులు లాల్ బహదూర్ శాస్త్రి, చిట్టి బాబు, శశిభూషణ్, మనోహరమ్మ, జాకబ్ రాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి @104 ..

- రాయల్ నేవీ తిరుగుబాటు కేసులో 18 నెలల జైలు శిక్ష
- కృష్ణమూర్తికి అభినందనలు తెలిపిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 104 ఏళ్ల వయస్సుండి పెన్షన్ అందుకుంటున్న ఏకైక వ్యక్తిగా ప్రముఖ సమరయోధుడు, రెవెన్యూ శాఖ మాజీ ఉద్యోగి ఏటుకూరి కృష్ణమూర్తి నిలిచారు. ఆయన గుంటూరు జిల్లా ఏటుకూరులో 1923 సెప్టెంబర్ 29న జన్మించారు. 1948లో కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డలో 1948లో నెలకు రూ.37 జీతంతో రెవెన్యూ శాఖలో చేరారు. 1978లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. రిటైర్డ్ అయ్యి 47 ఏళ్లు పూర్తయ్యాయి. బ్రిటిష్ పాలనలో రాయల్ నావికాదళంలో పనిచేస్తూ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నారు. నేవీ తిరుగుబాటులో పాల్గొన్నందుకుగానూ లక్నో, లాహోర్ జైళ్లల్లో 18 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని గుంటూరు సబ్ జైలులో ఎనిమిది నెలలు జైలు జీవితం గడిపారు. ఎపి ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ఉద్యోగులకు కనీస వేతనాలు, హక్కుల కోసం సభలు, ఉద్యమాలు నిర్వహించారు. కాసు బ్రహ్మానందరెడ్డి సీఎంగా ఉన్న కాలంలో జరిగిన 106 రోజుల సమ్మెలో ఉద్యోగులను ముందుండి నడిపించారు. జీతాల్లేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులకు నిత్యావసరాలు అందేలా ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు అనేక పుస్తకాలు ఆయన స్వయంగా రచించారు. నేటికీ పలు పుస్తకాలను రాస్తూ సొంత ఖర్చులతో ముద్రిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేతగా ఏటుకూరి నేటికీ పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. సిపిఐకి విరాళం అందిస్తూ సాయపడుతున్నారు. ఏటుకూరి కుటుంబ సభ్యులు సైతం తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ కమ్యూనిస్టు పార్టీకి అండగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆయన తన కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. '104 ఏళ్లు దాటినా నేటికీ సమాజ మార్పు కోసం పరితపిస్తున్న ఏటుకూరి కృష్ణమూర్తికి అభినందనలు' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆయన మరింత కాలం ఆరోగ్యంగా బతకాలని ఎపి ఎన్‌జిఒ సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి సుబ్బరాయన్ పాలంకి ఆకాంక్షించారు.